క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బుధవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 1వ వార్డులో రూ.20లక్షలు, 10వ వార్డులో రూ.30లక్షలు, 11వ వార్డులో రూ.25 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో చేపట్టే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

లక్సెట్టిపేట: స్థానిక ఐబీ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, తహసీల్దార్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

'పది పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం'

జన్నారం: పదోతరగతి పరీక్షల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోందని, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం సంఘ నాయకులతో సమావేశమయ్యారు. పది పరీక్షలు జరుగుతుంటే తెలుగు, హిందీ, ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లలో బయటకు రావడం, రాసిన పేపర్లు పోస్టు చేయడంలో, బండిల్స్ మిస్‌కావడం చూస్తుంటే, పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం చూపిస్తున్న తీరు అర్థం అవుతోందన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరు బాగోలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, పది పరీక్షలను పటిష్టంగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తాండూర్: వడగళ్ల వానతో పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం(ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి కొండు బానేష్ ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షం కురవడంతో మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం గ్రామాల వారీగా సర్వే చేసి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. మామిడి తోటలకు ఎకరానికి రూ.50వేలు, వరికి ఎకరానికి రూ.30వేలు, మొక్కజొన్న పంటకు రూ.20వేలు, కూరగాయల తోటలకు రూ.15వేలు చొప్పున పరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ఇంటింటికీ సీపీఐ నినాదం'

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలు, దేశ సమగ్రతకు వాటిల్లే ప్రమాదాలు వివరించడానికి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14నుంచి మే 14వరకు ఇంటింటికీ సీపీఐ నినాదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, నాయకులు పాల్గొన్నారు.

'గెల్లు'ను అభినందించిన బీఆర్ఎస్వీ నేత


శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రావణ్

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొత్తగా నియామకమైన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో బుధవారం శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శ్రావణ్ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు


బెల్లంపల్లి/దండేపల్లి/జన్నారం/చెన్నూర్‌రూరల్/రామకృష్ణాపూర్/భీమారం/నస్పూర్/పాతమంచిర్యాల/చెన్నూర్/మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుల వివక్షత, అసమానతలను విద్యార్థి దశలోనే ఎదిరించి, ప్రశ్నించిన స్వాతంత్ర్య సమరయోధుడని, విద్యార్థి లోకానికి ఆదర్శనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెన్నూర్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తూ..


బెల్లంపల్లి: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో..


దండేపల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద అంబేద్కర్ సంఘం నివాళి


జన్నారం: జగ్జీవన్‌రామ్‌కు నాయకుల నివాళి


భీమారంలో నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు


చెన్నూర్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్


సీసీసీ కార్నర్ వద్ద...


డీవైఎఫ్ఐ కార్యాలయంలో...


బెల్లంపల్లి: సీఓఈ కళాశాలలో...


మందమర్రి మున్సిపల్ ఆఫీస్‌లో..


జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఎస్సైకి విద్యార్థుల వినతి


ఎస్సైకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

మందమర్రిరూరల్: పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఐలవేన రామ్‌తేజ, తరుణ్ అనే విద్యార్థులు బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై చంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌పై, అతడికి సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అయ్యప్పకు పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీఅభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్తరనక్షత్ర పూజలతో పాటు, స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పదునెట్టాంబడిపై ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి పురుషోత్తమాచార్యులు, దండేపల్లి, లక్సెట్టిపేట, వెల్గటూర్, ధర్మపురి మండలాలనుంచి భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మనక్షత్రంను పుస్కరించుకొని ఇక్కడి అయ్యప్పకుటీరంలో ఉత్తర నక్షత్ర పూజను నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలను పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గురుస్వామి కొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉత్తరానక్షత్రకవచ పఠనం గావించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వెలమరెడ్డి శివారెడ్డి, స్వామి దీక్షపరులు చికిలం నాగయ్య, బచ్చలి ఉప్పలయ్య, మండ శ్రీనివాస్, భక్తులు బోనగిరి విలాస్, కావు శ్రీనివాస్, క్యాతం సతీశ్ పాల్గొన్నారు.

బండి అరెస్ట్‌పై భగ్గుమన్న శ్రేణులు


కిష్టంపేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఆదిల్‌పేట్‌లో ప్రభుత్వ దిష్టబొమ్మ దహనం

మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/బెల్లంపల్లి: బీజేపీ రాష్ట్ర చీఫ్, ఎంపీ బండి సంజయ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. పలు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు మాట్లాడుతూ.. పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో పోలీసులు బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎంపీ సంజయ్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ఆందోళనలు, ప్రజా ఉద్యమాలను ఆపలేదని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

భీమారం/లక్సెట్టిపేట/తాండూర్/రామకృష్ణాపూర్/వేమనపల్లి/కాసిపేట/శ్రీరాంపూర్/మంచిర్యాల రూరల్(హాజీపూర్)/నస్పూర్: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో బీజేపీ నాయకులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. కేసీఆర్ సర్కార్ టీఎస్‌పీఎస్ పరీక్ష పత్రాల లీకేజీతో ప్రజల్లో అబాసుపాలైందని గ్రహించి ఇప్పుడు టెన్త్ పేపర్ లీకేజీని బండి సంజయ్‌కు అంటగట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. నిర్బంధాలతో బీజేపీ ఎదగకుండా అడ్డుకోలేరన్నారు. సంజయ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టైన వారిలో రామకృష్ణాపూర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, భీమారంలో మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, శ్రీరాంపూర్‌లో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి మొగిళి, హాజీపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, నస్పూర్‌లో పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్‌డ్యుటి రాజు,లక్సెట్టిపేటలో బొప్పు సతీష్, కాసిపేటలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి సూరం సంపత్‌కుమార్, తాండూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, వేమనపల్లిలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఏట మధుకర్ తదితరులు ఉన్నారు.


భీమారం: అరెస్టైన నాయకులు

హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ

కాసిపేట: మండలంలోని సోమగూడెం, దుబ్బగూడెం, లంబాడితండా, ట్యాంకబస్తీలలో బుధవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా హనుమాన్ భక్తులు(మాలధరణ)బైక్ ర్యాలీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బగూడెంలో జైశ్రీరాం, హనుమాన్ నినాదాలతో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ ప్రారంభించారు. గురువారం కూడా బైక్ నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.


సోమగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

రక్షణపై జీఎం సమీక్ష

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3గనిలో రక్షణ చర్యలపై జీఎం సంజీవరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గని మేనేజర్ కార్యాలయంలో గనిలో తీసుకుంటున్న రక్షణచర్యలు, స్టావ్వింగ్ పనులు, యంత్రాల పనితీరుపై బుధవారం ఆయన సమీక్ష జరిపారు. నూతన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, ఇన్‌చార్జి ఏఎస్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎంలు చిరంజీవి, శివరావు, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, అధికారులు సాంబశివమూర్తి, శ్రీనివాస్, మహేందర్, వై ప్రేంకుమార్, అరుణ్‌కుమార్, పీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

తాళ్లగురిజాల ఎస్సై నరేష్ బాధ్యతలు స్వీకరణ



బెల్లంపల్లి: మండలంలోని తాళ్లగురిజాల ఎస్సైగా గోపతి నరేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తాళ్లగురిజాల ఎస్సైగా పనిచేస్తున్న జి.రాజశేఖర్ సీసీఎస్ మంచిర్యాలకు బదిలీ కాగా ఆయన స్థానంలో వేమనపల్లి మండలం నీల్వాయి ఎస్సైగా పని చేస్తున్న నరేష్‌ను తాళ్లగురిజాలకు బదిలీ చేశారు. ఈ మేరకు నరేష్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బదిలీపై వచ్చిన ఎస్సై నరేష్‌కు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం



నెన్నెల: మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించిన రాజశేఖర్ బదిలీపై తాండూర్‌కు వెళ్తున్న సందర్భంగా ఆయనను బుధవారం మండల నాయకులు, ప్రజలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, నెన్నెల ఎంపీటీసీ తిరుపతి, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్: పదో తరగతి హిందీ పరీక్షా పత్రం లీకేజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలోనే జరిగిందని ఆరోపిస్తూ చెన్నూర్ పట్టణంలో బుధవారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్ చైర్‌పర్సన్ అర్చన రామ్‌లాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, జెడ్పీటీసీ తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్స్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కోటపల్లి: పదో తరగతి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మండలంలోని నాగంపేటలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని కుట్రతో పదో తరగతి పేపర్ లీక్ అయిందని విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళన గురి చేయడమే లక్ష్యంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మొగిలి, సమ్మయ్య,అన్వర్ పాల్గొన్నారు.


చెన్నూర్: బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మందమర్రిరూరల్: పదో తరగతి పేపర్ లీకేజీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హస్తం ఉందని ఆరోపిస్తూ పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.


మందమర్రిలో...


కోటపల్లిలో...

మార్కెట్‌లోకి హ్యుందాయ్ సరికొత్త వెర్నా

మంచిర్యాలటౌన్: ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటర్ ఇండియా తమ న్యూ వెర్నా కారును ప్రవేశపెట్టింది. పట్టణంలోని గద్దెరాగడిలోని ప్రకాశ్ హ్యుందాయ్ షోరూంలో షోరూం సీఈవో నల్ల ప్రతిహార్, సీఐ ఎం.రాజు, ఎస్సై రాజేందర్ బుధవారం సరికొత్త వెర్నా కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సెడాన్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సరికొత్త మోడల్ న్యూ వెర్నా కారును హ్యుందాయ్ మోటర్ ఇండియా మార్కెట్‌లో రూ.10.89లక్షలు ప్రారంభ ధర (ఎక్స్ షోరూమ్) గా వద్ద విడుదల చేసిందన్నారు. కొత్త వెర్నా సెడాన్ ఇప్పుడు కొత్త 1.5లీటర్ టార్బో చార్జ్, పెట్రోల్ ఇంజిన్‌తో, ఇది 160బిహెచ్‌పి శక్తిని, 250ఎన్ఎం కంటే ఎక్కువ టార్క్‌ను ఉత్పత్తి చేయగలదని, గేర్ బాక్స్ ఎంపికలు 6–స్పీడ్ మాన్యువల్ లేదా 7–స్పీడ్ డిసిటిని కలిగి ఉంటాయన్నారు. సెడాన్ కారు ప్రేమికులకు నచ్చే విధంగా సరికొత్త డిజైన్‌తో రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ రాజ్‌కుమార్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


కారును ఆవిష్కరిస్తున్న సీఈవో ప్రతిహార్, సీఐ రాజు

ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్

- జైపూర్ ఏసీపీ నరేందర్

కోటపల్లి: ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని జైపూర్ ఏసీపీ నరేందర్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి రాజరం గ్రామంలో బుధవారం ఏసీపీ నరేందర్ ఆధ్వర్యంలో సీఐ విద్యాసాగర్, 20మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ.. నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కోసమే పోలీసింగ్ ఉందని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. అనంతరం గ్రామంలోని యువకులకు వాలీబాల్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై వెంకట్, టీఎస్ఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.


పట్టుబడిన వాహనాలతో పోలీసులు